క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



నారాయణపురంలో ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: పరిసరాల పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా జీవించవచ్చని మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. నారాయణపురం సచివాలయం 2 పరిధిలో శనివారం డ్రైడేలో అమలైన కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ నీటి నిల్వలు ఇంటి పరిసరాల్లో లేకుండా చూసుకోవాలని సూచించారు. ఆరోగ్య సహాయకులు ఆర్ పార్థ సారథి, ఎంఎల్‌హెచ్‌పీ అనూష, ఆశ కార్యకర్తలు రమణ, దుర్గ పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



ఆలయ ఆవరణలో కోలాటమాడుతున్న కళాకారులు

దెందులూరు: చల్ల చింతలపూడిలోని శ్రీ మేధా దక్షిణామూర్తి శివాలయం ఉత్సవాల్లో భాగంగా శనివారం సాంస్కృతిక ప్రదర్శనలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను, గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు పూజలు ప్రదక్షిణలు చేశారు.

కంప్యూటర్ బహూకరించిన పూర్వ విద్యార్థులు



హెచ్‌ఎంకు కంప్యూటర్ కలర్ ప్రింటర్‌ను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

దెందులూరు: కొవ్వలి ఉన్నత పాఠశాలలో 1968– 69 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు శనివారం కంప్యూటర్ కలర్ ప్రింటర్, బీరువాను పాఠశాల హెచ్‌ఎం శర్మకు అందజేశారు. విద్య నభ్యసించిన కొవ్వలి ఉన్నత పాఠశాల అభివృద్ధికి తమ వంతు తోడ్పాటుగా బీరువా, కంప్యూటర్ కలర్ ప్రింటర్‌ను అందజేసినట్టు పూర్వ విద్యార్థులు అన్నారు. హెచ్‌ఎం శర్మ ఎస్ఎంసీ చైర్మన్ బీద గణేష్‌కుమార్, సభ్యులు కనుకుర్తి రామకృష్ణ అభినందించారు.

86.68 శాతం పింఛన్ల పంపిణీ

ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో శనివారం 11,325 పింఛన్లలో 9,817 మందికి పంపిణీ (86.68 శాతం) చేసినట్లు ఎంపీడీవో రాజ్ మనోజ్ తెలిపారు. అత్యధికంగా తల్లాపురంలో 92.17 శాతం మందికి, ఉంగుటూరులో అత్యల్పంగా 50.85 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేశామన్నారు. ఎంపీడీవో రాజ్‌మనోజ్ ఉంగుటూరులో వికలాంగులకు పింఛన్లు పంపిణీ చేశారు.

మత్స్యకారులకు ఉపాధి పెంచేందుకు కృషి



చెరువులో చేప పిల్లలను వదులుతున్న జిల్లా ఫిషరీస్ అధికారి నాగలింగాచార్యులు

ఉంగుటూరు: మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా మత్స్యశాఖ అధికారి కేఎస్‌వీ నాగలింగాచార్యులు అన్నారు. శనివారం వెల్లమిల్లి పంచాయతీ చింతాయిగూడెం వీరభద్రుని చెరువులో బొమ్మిడి మత్స్యకార సొసైటీ సభ్యులకు కేటాయించిన చెరువులో 60 శాతం సబ్సిడీపై 60 వేల చేప పిల్లలను అందజేశారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో చెరువులో చేపపిల్లలను వదిలారు. బాదంపూడి మత్స్యకేంద్రం ఏడీఏ నర్సయ్య, ఉంగుటూరు మండల మత్స్య శాఖ అధికారి మంగరావు, బొమ్మిడి మత్స్య సహకార సొసైటీ ప్రతినిధులు తాటిపాక వరహాలు, లక్ష్మయ్య, మసేన్‌రావు పాల్గొన్నారు.

చెత్తరహిత సమాజమే ధ్యేయం

గణపవరం: చెత్తలేని సమాజ నిర్మాణమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గణపవరం ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి, ఈవోపీఆర్డీ సత్యనారాయణ అన్నారు. శనివారం గణపవరం పట్టణంలో ఇంటింటికీ వెళ్లి చెత్తసేకరణ, తడి, పొడిచెత్తను వేర్వేరుగా నిల్వ చేయడం, మురుగునీటి నిల్వలు, తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈఓ డి.శివరామ్‌ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుకు ఏదీ భరోసా?

- ఉంగుటూరు నియోజకవర్గంలో నిర్వీర్యమవుతున్న ఆర్‌బీకేలు
- గతంలో 60 రైతు భరోసా కేంద్రాల నిర్మాణం
- 64 వేల మంది రైతులకు రూ.470 కోట్ల లబ్ధి
- ప్రభుత్వ తీరుపై పెదవి విరుస్తున్న రైతులు



దాళ్వా పంటలో మందులు పిచికారీ చేస్తున్న రైతు

ఉంగుటూరు: ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలతో ఒకప్పటి రైతు భరోసా కేంద్రాలు, ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలు వెలవెలబోతున్నాయి. సూపర్ సిక్స్‌లో ఒకటైన అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఇస్తానన్న రూ.20 వేలు ఇంతవరకు కూటమి ప్రభుత్వం అమలు చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఒక పంటకాలం పూర్తయ్యింది. రెండో పంట రైతులు పండిస్తున్నారు. ఆర్థికంగా ఇప్పటి వరకూ ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందక రైతులు ఎదురు చూస్తున్నారు. రైతుకు పెద్ద పీట వేసి ఓ వ్యవస్థనే సృష్టించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుంది. ప్రతి గ్రామంలో రూ.21 లక్షలు వ్యయంతో ఆర్‌బీకేలు నిర్మించారు. అందులో వ్యవసాయ సహాయకులను నియమించి రైతులకు సేవలందించేలా ఏర్పాట్లు చేశారు. విత్తనం మొదలుకుని ఉత్పత్తులు విక్రయించుకునే వరకు అన్నదాతలకు రైతు భరోసా కేంద్రాలు, అందులోని ఉద్యోగులు ఉపయోగపడ్డారు. పంటల సాగు సమయంలో సబ్సిడీపై ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందజేసేవారు. ధాన్యం కొనుగోలు చేసేవారు. రైతులందరికీ ఈ– క్రాప్ బుకింగు చేసేవారు. ఈ–క్రాప్ బుక్ చేసుకున్న ప్రతి రైతు పంటల బీమా పొందేవారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులు నష్ట పరిహారం అందుకునే వారు. రైతులకు సాగుకు సూచనలు, సలహాలు ఆర్‌బీకేలో అందేవి. కేంద్ర ప్రభుత్వం అందించే రూ.6 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.7,500 సకాలంలో మొత్తం రూ.13,500 రైతులు అందుకునే వారు.

నిరుపయోగంగా ఆర్‌బీకేలు

రైతు సేవా కేంద్రాలుగా మారిన ఆర్‌బీకేల ద్వారా రైతులకు ప్రస్తుతం అరకొర సేవలు అందుతున్నాయి. ఆర్‌బీకే వ్యవస్థను ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. వ్యవసాయ సహాయకులను రైతులకు సేవలందించడం కన్నా ఇతర సేవలకు ఉపయోగిస్తున్నారు. సచివాలయాలకు అనుసంధానంగా ఇవి ఉండటంతో యాప్‌ల నిర్వహణ, సర్వేలకు వ్యవసాయ సహాయకులు పనిచేయాల్సి వస్తోంది. ఇప్పుడు పంటల బీమా ప్రీమియం ప్రభుత్వం చెల్లించడంలేదు. రైతులే ప్రీమియం చెల్లించాల్సి వస్తోంది. గత పంట సమయంలో 20 శాతం మంది పంటల బీమా ప్రీమియం చెల్లించలేదు. దీంతో ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే రైతులు నష్టపోయే పరిస్థితి ఉత్పన్నమవుతోంది. కేంద్ర ప్రభుత్వం రైతు భరోసాలో భాగంగా అందించిన రూ.6 వేలు మినహా రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు రైతులకు ఎటువంటి ఆర్థిక లబ్ధి చేకూర్చలేదు. దాంతో రైతు వర్గాలు కూటమి ప్రభుత్వం తీరుపై పెదవి విరుస్తున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో 60 రైతు భరోసా కేంద్రాలు నిర్మించారు. రైతుకు పెద్దపీట వేసి, ఒక కార్యాలయం అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుంది. రైతే రాజు, రైతు సంక్షేమమే లక్ష్యంగా పథకాలు అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే సాధ్యమైంది. వైఎస్సార్‌సీపీ హయాంలో 63,013 మంది రైతులు రూ.470 కోట్ల మేర లబ్ధి పొందారు.

ఉంగుటూరు నియోజకవర్గం వివరాలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు అందిన పథకాల లబ్ధి

పథకం పేరు	లబ్ధిపొందిన రైతులు	లబ్ధి పొందిన నగదు
వైఎస్సార్ భరోసా	27,619	18,642,82500
సున్నా వడ్డీ పంట రుణాలు	12,427	3,93,93,482
ఉచిత పంటల బీమా	10,127	22,64,36,307
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	9,097	8,40,79,817
ఆక్వా సబ్సిడీ	3,546	246,43,00,000
సబ్సిడీపై యంత్రాలు	197	2,70,40,002
మొత్తం	63,013	470,55,32,108

రైతులను నిర్వీర్యం చేశారు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు పెద్ద పీట వేశారు. ఎప్పుడూ లేని విధంగా రైతు భరోసా కార్యాలయాలు నిర్మించారు. రైతులకు ఒక ఆఫీసు ఉండేలా చేశారు. సకాలంలో రైతు భరోసా రూ.13,500 జమ చేసి రైతులకు పెట్టుబడి సాయం అందించే వారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులను నాశనం చేశారు. రైతు భరోసా పేరును అన్నదాత సుఖీభవగా మార్చారు. ఇప్పటికీ ఒక్క రూపాయి కూడా సాయం చేయలేదు. ఏడాది అవుతున్నా రైతులకు ఒరిగిందేమీ లేదు.

– చోడే వెంకటేశ్వరరావు, రైతు, కైకరం



వెలవెలబోతున్న రైతు భరోసా కేంద్రం

3 నుంచి విద్యుత్ కండక్టర్ల మార్పు పనులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): భీమడోలు – ఏలూరు 132 కేవీ విద్యుత్ ఫీడర్‌లో ప్రస్తుతం ఉన్న కండక్టర్ మార్పే పనులు ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ట్రాన్స్‌కో సూపరింటెండింగ్ ఇంజినీర్ ఈ.సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పనులు జరిగే సమయంలో ఏలూరు వంగాయగూడెం విద్యుత్ కేంద్రానికి కానుమోలు విద్యుత్ కేంద్రం నుంచి విద్యుత్ సరఫరా చేస్తామని పేర్కొన్నారు. ఆయా రోజుల్లో సాంకేతిక లోపం వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే సహకరించాలని ప్రజలను కోరారు.

పారదర్శకంగా 'పది' పరీక్షలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఈ నెల 17 నుంచి 31 వరకు 10వ తరగతి పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేందుకు కృషి చేయాలని పరీక్షల ఏలూరు జిల్లా పరిశీలకుడు, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి కోరారు. ఈ పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరిటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్, అడిషనల్ డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్, కస్టోడియన్లకు శనివారం స్థానిక సీఆర్ ఆర్ అటానమస్ కళాశాలలో ఒక రోజు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణారెడ్డి మాట్లాడుతూ పరీక్షల నిబంధనలను వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ ఎల్ శ్రీకాంత్, జిల్లా విద్యాశాఖాధికారి ఎం వెంకటలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీఏ, డీఏలు ఇవ్వాలి

పదో తరగతి పరీక్షల నిర్వహణకు నియమితులైన సిబ్బందికి టీఏ, డీఏలు వెంటనే ఇవ్వాలని డెమొక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు కోరారు. ఈ మేరకు పరీక్షల జిల్లా పరిశీలకుడు ఎంవీ కృష్ణారెడ్డిని కలిసి మూడేళ్లుగా పది పరీక్షల విధులు నిర్వహించిన చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, రూట్ ఆఫీసర్లకు టీఏ, డీఏలు విడుదల చేయలేదని వివరించారు. సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని కృష్ణారెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు.

ప్రశాంతంగా జూనియర్ ఇంటర్ పరీక్షలు



పెదవేగి దీపాల్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సర పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

భీమడోలు: జూనియర్ ఇంటర్ పబ్లిక్ పరీక్షలు శనివారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. తెలుగు, సంస్కృతం, ఒకేషనల్ సబ్జెక్టులకు సంబంధించిన విద్యార్థులు పరీక్షలు రాసారు. ముందుగానే విద్యార్థుల హాల్ టిక్కెట్లను పరిశీలించి ఇన్విజిలేటర్లు వారి తరగతి గదుల్లోకి అనుమతించారు. భీమడోలులోని శ్రీవేంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాలలోని పరీక్షా కేంద్రంలో 264 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 18 మంది గైర్హాజరయ్యారు. 246 మంది పరీక్షలు రాసారు. ఈ పరీక్షా కేంద్రంలో పోలసానిపల్లి గురుకుల బాలికల కళాశాల, మాధురి, గీతాంజలి కళాశాలలు, ద్వారకాతిరుమల మండలంలోని ద్వారకాతిరుమల శ్రీనివాస కళాశాల, వెలుగు కళాశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులంతా పరీక్షలు రాసారు. పోలసానిపల్లి బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల పరీక్ష కేంద్రంలో భీమడోలు శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాల, ఇతర కళాశాలకు చెందిన 308 మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 17 మంది గైర్హాజరయ్యారు. 291 మంది పరీక్షలు రాసారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రాలకు అనుమతించలేదు. ప్రతి పరీక్షా హాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను ఏర్పాటు చేసారు.

ఇంటర్ పరీక్షలకు 332 మంది హాజరు

పెదపాడు: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు పెదపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 346 మంది విద్యార్థులకు 332 మంది హాజరైనట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఆయన చెప్పారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం నుంచి జరుగుతాయని చెప్పారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

పెదవేగి : ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పెదవేగి మండంలో పినకడిమిలోని సెయింట్ విన్సెంట్ డీపాల్ కళాశాల్లో వివిధ కళాశాలల విద్యార్థులు, పెదవేగి సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో విద్యార్థులు పరీక్షలు రాసారు.

నారాయణపురంలో 16 మంది గైర్హాజరు

ఉంగుటూరు: నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. 16మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. 218 మంది విద్యార్థులకు 202 మంది హాజరై పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంటుగా పి. వెంకటేశ్వరరావు, డిపార్టుమెంటల్ ఆఫీసర్‌గా దేవ విజయలక్ష్మి వ్యవహరించారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కార్మిక సంక్షేమానికి బడ్జెట్‌లో మొండిచేయి



మాట్లాడుతున్న నారపల్లి రమణారావు

నిడమర్రు: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు కోరారు. తాజా బడ్జెట్‌లో కార్మిక సంక్షేమానికి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి సర్కారు మొండి చేయి చూపించిందని ఆయన విమర్శించారు. భవన నిర్మాణ సంఘం సమావేశాలు శనివారం అడవికొలను, చానమల్లి, పెదనింద్రకొలనులో నిర్వహించారు. ఈ సమావేశాలకు హాజరైన నారపల్లి రమణారావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని, కార్మికుల సంక్షేమ పథకాల అమలుకు రూ.కోటి నిధులు విడుదల చేస్తామని ఎన్నికల్లో చంద్రబాబు, పవన్ కల్యాణ్ హామీలు గుప్పించారన్నారు. తాజా బడ్జెట్‌లో ఆ ఊసేలేదన్నారు. నిర్మాణ రంగం కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలన్నారు. నిషేధంలో ఉన్న 12,14 మెమో ఎత్తి వేసి వెంటనే సంక్షేమ బోర్డుకు నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఈ సమావేశంలో చినిమిల్లి రాంబాబు, పెరికల శ్రీను, టీకుమూడి ప్రభాకర్, జగదీష్, సత్యనారాయణ తదితరులున్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి



కురెళ్లగూడెంలో అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

భీమడోలు: ఎస్సీ వర్గీకరణకోసం అసువులు బాసిన మాదిగ అమరవీరుల ప్రాణత్యాగాలు మరువలేనివని ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు అన్నారు. ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని భీమడోలు, పోలసానిపల్లి, కురెళ్లగూడెంలో శనివారం జాతి కోసం ప్రాణ త్యాగం చేసిన మద్దు బిడ్డలకు నివాళులర్పించే కార్యక్రమాన్ని నిర్వహించి వారి సేవలను స్మరించుకున్నారు. కురెళ్లగూడెంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా నాయకులు కొత్తపల్లి చంద్రమౌళి అధ్యక్షత వహించారు. సీనియర్ నాయకులు ఎం.ఏలీయా మాదిగ, కాటూరి జోగేశ్వరరావు మాదిగ, కాటూరి సునీత, ఎస్.కిషోర్ పాల్గొన్నారు.

మాదిగ అమరవీరులకు నివాళులు

పెదవేగి : నాగన్నగూడెంలో స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని తనగాల శ్యామ్‌బాబు, కన్నూరి కిషోర్, కొండపల్లి రాజేంద్ర ప్రసాద్, ఆధ్వర్యంలో నిర్వహించారు.ముఖ్య అతిథిగా ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగాల శేఖర్‌మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా గౌరవ అధక్షుడు మద్దాల తిరుపతిరావు మాదిగ, జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి మురళిమాదిగ పాల్గొన్నారు. వేగివాడలో ఎంఆర్‌పీఎస్ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి మురళీ కృష్ణ అధ్యక్షతన మాదిగ అమరవీరుల దినోత్సవం నిర్వహించారు.

అమర వీరులకు జోహార్లు

ఉంగుటూరు: మాదిగ అమర వీరులకు జోహార్లు అర్పించే కార్యక్రమం నల్లమాడు, కై కరంలో శనివారం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మాముదూరి ఏలియా మాదిగ ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు.

ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు కృషి



దుకాణాల వద్ద అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, ఈవోఆర్డీ సుందరి

భీమడోలు: ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల డ్రైవ్‌లో భాగంగా తొలి రోజైన శనివారం గుండుగొలను, లక్ష్మీపురం, ఆగడాలలంక, చెట్టున్నపాడులో పారిశుధ్య కార్యక్రమాలు అమలును ఈవోఆర్‌డీ ఏ.సుందరితో కలిసి ఆమె పరిశీలించారు. ప్లాస్టిక్ నివారణ, తడి, పొడి చెత్త సేకరణపై మహిళలకు అవగాహన కల్పించి కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజారోగ్యానికి హాని, పర్యావరణానికి విఘాతం కలిగించే ప్లాస్టిక్‌ను నిర్మూలించాలన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు కె.మురళి, డ్వాక్రా సంఘాల సభ్యులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ



ప్రింటర్ అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

గణపవరం: ముప్పర్తిపాడు యూపీ పాఠశాలలో 2003–2004 సంవత్సరంలో 7వ తరగతి చదివిన విద్యార్థులు పాఠశాల ఆవరణలో శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాఠశాలకు రూ.18వేల విలువైన కలర్ ప్రింటర్‌ను బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రి రాధాలక్ష్మి, విద్యాదాత అల్లూరి బదరీ నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హమాలీ కార్మికులకు గ్రాట్యుటీ ఇవ్వాలి

భీమడోలు: హమాలీ కార్మికుల ఆందోళన నేపథ్యంలో ప్రభుత్వం దిగి వచ్చిందని, కార్మికుల కూలీ రేట్లు పెంచిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు అన్నారు. సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరు సివిల్ సప్లై గోడౌన్‌లోని కార్మికులు తమకు న్యాయబద్ధంగా అమలు చేయాల్సిన కూలి రేట్లు పెంచుతూ ప్రభుత్వం జీవో జారీ చేయడంపై శనివారం హర్షం వ్యక్తం చేశారు. హమాలీ కార్మికుడు పదవీ విరమణ తర్వాత వారికి గ్రాట్యుటీ ఇవ్వాలని లింగరాజు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జట్టు మేస్త్రి త్రిమూర్తులు, యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి దుర్గారావు, పెద్దలు మత్తే ప్రసాద్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శివారు భూములకు అందని సాగునీరు

- ఆందోళనలో గుండుగొలను ఆయకట్టు రైతులు
- ఉన్నతాధికారుల దృష్టికి సమస్య



గుండుగొలను వద్ద అరకొరగా సాగునీరు ప్రవహిస్తున్న దృశ్యం

భీమడోలు: గోదావరి ఏలూరు కాలువ శివారు గుండుగొలను ఆయకట్టు వరి పొలాలకు సాగునీరు అందక రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో నెల రోజుల్లో దాళ్వా పంట చేతికందే దశలో సాగునీరు పంట చేలకు చేరకపోవడంతో వేలాది రూపాయల పెట్టుబడితో ఆరుగాలం పండించిన పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. సార్వాలో పంట దెబ్బతిన్న రైతులు దాళ్వాపై ఆశ పెట్టుకున్నారు. అయితే జలవనరుల శాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడం, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల దాళ్వా సాగు ఆరంభం నుంచి ఎగువనుంచి వదిలిన సాగునీరు దిగువ ప్రాంతాలకు చేరకపోవడంతో పంట పొలాలు బీడుగా మారే పరిస్థితులు తలెత్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నీటి వృథాతో తగ్గిన నీటి మట్టం

గుండుగొలను వంతెన వద్ద 3.5 అడుగుల నీటి మట్టం ఉంటేనే పంట పొలాలకు నీరు ప్రవహిస్తోంది. ప్రస్తుతం 2.2 అడుగుల నీటి మట్టం ఉందంటే ఇక్కడ నీటి సమస్య ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. దీనితో నీరు శివారుకు చేరడం లేదని, గుండుగొలను ఆయకట్టులోని 6 స్లూయిజ్‌ల్లోని 5 వేల ఎకరాల పంట దెబ్బతింటోందని, ఉన్నతాధికారులు నీటి మట్టం పెంచేలా తగు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామని రైతులు అంటున్నారు. దీనిపై భీమడోలు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ గంధం లక్ష్మణ్, గుండుగొలను సాగునీటి సంఘం అధ్యక్షుడు డోకల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కాకోతుల సోమేశ్వరరావు, సభ్యులు గుండుగొలను ఇరిగేషన్ కార్యాలయ సిబ్బంది దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ పరిధిలో కైకరం నుంచి గుండుగొలను ఉండగా పూళ్ల, భీమడోలు వరకు నీటి మట్టాలు 4 అడుగులు ఉంటుందని, ఆ తర్వాత గుండుగొలను వద్దకు వచ్చేసరికి 2.20 అడుగుల నీటి మట్టం ఉంటుందని దీని వల్ల రైతులకు ఒరిగేదేమీ లేదని అన్నారు. ఎండల తీవ్రతతో నీటి మట్టం మరింత తగ్గుతోందని సాగునీటి సంఘం ప్రతినిధులు జలవనరుల శాఖ సిబ్బందికి తెలిపారు. నీటి వృథాను అరికట్టాలని వారంతా కోరారు.

నీటి విడుదలను పెంచాలి

గోదావరి ఏలూరు కాలువకు వంతుల వారీ విధానంలో 4,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారని, అడుగడుగునా నీటి ప్రవాహానికి ఆటంకాలున్నాయని, వాటిని పరిష్కరించకపోవడంతో అరకొరగా గుండుగొలను శివారు 830 క్యూసెక్కుల నీరు చేరుతోందని రైతులు తెలియజేసారు. మరో 800 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తేనే ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందుతుందని, వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో రైతులు ఆందోళన చేసే పరిస్థితి ఏర్పడుతుందని సాగునీటి సంఘం ప్రతినిధులు అన్నారు. జలవనరుల శాఖ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకుని వెళ్తామని సిబ్బంది తెలిపారు.

కాలువలో గుర్రపు డెక్క, తూడు తొలగింపు

భీమడోలు/దెందులూరు: గుండుగొలను వద్ద గోదావరి కాలువలోని పడిపోయిన నీటి మట్టాలను కలెక్టర్ వెట్రిసెల్వి శనివారం పరిశీలించారు. కాలువలోని గుర్రపు డెక్క, తూడులను తొలగింపు పనులను కలెక్టర్ పరిశీలించి జలవనరుల శాఖ ఉన్నతాధికారులకు తగు ఆదేశాలు జారీ చేసారు. నీటి మట్టాన్ని పెంచేందుకు సంబంధిత అధికారులు కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూడులను పూర్తి స్థాయిలో తొలగించాలని ఆదేశించారు. ఈ పనులను సకాలంలో పూర్తి చేయాలని లేని పక్షంలో కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో ఉంచాలని సూచించారు. సాగునీటి వృథాను అరికట్టాలని సూచించారు. గుండుగొలను వద్ద నీటి మట్టం పెంచేందుకు జలవనరుల శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు.